సాక్షి ఆదిలాబాద్

గురువారం । 16 । అక్టోబర్ । 2025

తుపాకీ దించి.. అజ్ఞాతం వీడి..

నమ్మిన సిద్ధాంతం కోసం అడవిబాట పట్టి అజ్ఞాతం లోకి వెళ్లారు. సుమారు నాలుగున్నర దశాబ్దాలకు పైగా ఉద్యమం ప్రస్థానం కొనసాగించారు. తాజాగా మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు అభిప్రాయంతో ఏకీభవించి తుపాకీ దించి వనం వీడారు. వారే ఉమ్మడి జిల్లాకు చెందిన మావోయిస్టు కీలక నేతలు సలాకుల సరోజ, మోహన్‌రెడ్డి. 10లో▸



గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

అక్రమ రిజిస్ట్రేషన్, సప్లిమెంటరీ సేత్వార్ రద్దు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అర్బన్ మండలంలోని భుక్తాపూర్ శివారు సర్వే నంబర్ 64/4, 65/బి లోని ఈడీ ఆధీనంలో ఉన్న భూమిని బడా రియల్టర్లు కబ్జా చేసిన వ్యవహారంపై రెవెన్యూ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈ వ్యవహారంలో పోలీసులు రంగంలోకి దిగి అక్రమార్కులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. అలాగే ఈ అక్రమ దందాకు సహకరించిన రెవెన్యూ, సర్వేల్యాండ్ రికార్డ్స్, రిజిస్ట్రేషన్ అధికారుల పాత్రపైన విచారణ జరుపుతున్నారు. అయితే అక్రమ భూరిజిస్ట్రేషన్, సప్లమెంటరీ సేత్వార్ రద్దు చేయాలని కలెక్టర్ రాజర్షి షా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు స్పందించిన ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ తాను చేసిన తప్పులను సరిదిద్దుకునే చర్యలు చేపట్టారు. అక్రమ సేత్వార్ రద్దుతో పాటు మ్యాన్‌వల్ విధానంలో జరిగిన రిజిస్ట్రేషన్‌ను ఆ శాఖ అధికారులతో కలిసి రద్దుకు చర్యలు చేపట్టారు.

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గం

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా దర్శనాల మల్లేశ్, అధ్యక్షురాలుగా దొనిపెల్లి వెంకటమ్మ, ప్రధాన కార్యదర్శిగా కామ సునీత, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జే.సుభద్ర, కోశాధికారిగా పి.రత్నమాల, ఉపాధ్యక్షులుగా ఎం.మధునిక, డి.సునీత, స్వర్ణలత, ఎస్‌కే.నజీమా, జి.పార్వతిబాయి, సహాయ కార్యదర్శులుగా ఎం.సుజాత, కళావతి, కుశివర్త, ఎం.సుజాత, కే.రేణుకతో పాటు మరో 35మంది సభ్యులు ఎన్నికై నట్లు గౌరవాధ్యక్షుడు తెలిపారు.

అంతర్జాతీయ సందర్శనకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: అంతర్జాతీయ విద్యా కార్యక్రమాల అవగాహన కోసం ఆసక్తి గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఖుష్బూగుప్తా ప్రకటనలో తెలిపారు. ఐదు రోజుల పాటు సింగపూర్, ఫిన్‌లాండ్, వియత్నాం, జపాన్ దేశాల్లో పర్యటించే అవకాశముందని పేర్కొన్నారు. ఆయా దేశాల్లో అమలు చేస్తున్న విద్యా విధానం, బోధన పద్ధతులు, వృత్తి నైపుణ్యాలు పెంపొందించే అంశాలను ఈ పర్యటనలో అధ్యయనం చేయవచ్చని తెలిపారు. ఆసక్తి గల అన్ని క్యాడర్‌ల ఉపాధ్యాయులు ఈ నెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా నుంచి ముగ్గురిని ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

కో‌ఆర్డినేటర్ పోస్టుకు..
జిల్లా విద్యాశాఖ పరిధిలో ఖాళీగా ఉన్న కో–ఆర్డినేటర్ (జెండర్ ఈక్విటీ) పోస్టులో డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు మహిళా హెడ్‌మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 18 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పెంపు
నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ఈ నెల 18వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈవో ఖుష్బూగుప్తా ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ http// bse. telangana. gov. in లో పొందాలని ఆమె సూచించారు

'రైతు ఆత్మహత్యల నివారణలో ప్రభుత్వం విఫలం'

బజార్‌హత్నూర్: రైతు ఆత్మహత్యల నివారణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మండల కేంద్రంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు పడిపెల్లి విలాస్ కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.6లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట చట్ల ఉత్తం, అశోక్ ఉన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ఐదు మండలాల పరిధిలో గల నిరుపేద యువతీ, యువకుల సౌకర్యార్థం పోలీసుల ఆధ్వర్యంలో మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటనలో తెలిపారు. నార్నూర్, గాదిగూడ, బజార్‌హత్నూర్, సిరికొండ, భీంపూర్ మండలాల్లోని యువత ఆయా పోలీస్‌స్టేషన్లలో ఈ నెల 18వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆధార్, టెన్త్ మెమో జిరాక్సు ప్రతులతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. తొలుత ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల్లో లర్నింగ్ లైసెన్స్ కోసం రూ.600 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. లర్నింగ్ లైసెన్స్ వచ్చిన తర్వాత ఆరు నెలల లోపు పర్మినెంట్ లైసెన్స్ కోసం రూ.1200 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

డీసీసీ పీఠం ఎవరికో?



ఆదిలాబాద్‌లో పార్టీ ముఖ్యనేతలతో చర్చిస్తున్న ఏఐసీసీ పరిశీలకుడు అజయ్‌సింగ్

- పలువురు ఆశావహుల దరఖాస్తు
- ముగిసిన పరిశీలకుల సర్వే
- ఏఐసీసీకి చేరనున్న పేర్లు
- బిహార్ ఎన్నికల తర్వాత ఖరారయ్యే అవకాశం

సాక్షి, ఆదిలాబాద్: జిల్లా కాంగ్రెస్ పార్టీలో మూడేళ్లుగా ఖాళీగా ఉన్న అధ్యక్ష పీఠం ఎవరు అధిరోహిస్తారనే ఉత్కంఠ నెలకొంది. ఈ సారైనా ఈ ప్రక్రియ పూర్తిగా కొలిక్కి వచ్చినట్లేనా.. లేని పక్షంలో గతంలో మాదిరిగా పరిశీలన తర్వాత నిలిచిపోతుందా అనే విషయంలో కార్యకర్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఏఐసీసీ నియమించిన పరిశీలకుడు అజయ్‌సింగ్ జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించి రెండు నియోజకవర్గాల్లో కార్యకర్తల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. అలాగే పలువురు ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. సర్వే ముగించిన పరిశీలకులు ఈ పేర్లను, నివేదికను ఏఐసీసీకి పంపించనున్నారు. అక్కడి నుంచే వివిధ అంశాలను పరిగణలోకి తీసుకుని పేరు ఖరారవుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బిహార్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో డీసీసీ అధ్యక్షుల నియామకం చేపడుతారని పేర్కొంటున్నారు.

ముగిసిన సర్వే ..
ఏఐసీసీ పరిశీలకుడు, కర్నాటక రాష్ట్రంలోని జేవర్గి ఎమ్మెల్యే అజయ్‌సింగ్, ఆయనను సమన్వయం చేసేందుకు పీసీసీ నుంచి పంపిన నేతలు సంఘటన్ శ్రుజన్ అభియాన్ సమన్వయ కర్త గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాంభూపాల్, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్ జిల్లాలో పర్యటించారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి సంబంధించి పార్టీ శ్రేణుల అభిప్రాయ సేకరణ కోసం జిల్లా కేంద్రంలోని గాయత్రీ గార్డెన్‌లో మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. అలాగే బోథ్ నియోజకవర్గ పార్టీ శ్రేణుల అభిప్రాయ సేకరణ కోసం బుధవారం ఇచ్చోడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశమయ్యారు. కాగా ఈ రెండు సమావేశాల్లో పలువురు ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. కొంతమంది నేరుగా దరఖాస్తు చేసుకోగా, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ స్థానికంగా లేకపోవడంతో ఆయన సోదరుడి ద్వారా, అలాగే మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి కూడా అందుబాటులో లేకపోవడంతో తన అనుచరుడి ద్వారా దరఖాస్తు అందజేశారు.

సర్వే ముగియడంతో ఇప్పుడు జిల్లా అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందనేది పార్టీలో కార్యకర్తలు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఇదిలా ఉంటే పలువురు ఆశావహులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ పరిశీలకులు కార్యకర్తల అభిప్రాయం మేరకు విభిన్న సామాజికవర్గాల నుంచి ముగ్గురి పేర్లను ఏఐసీసీకి పంపనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందులో ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో ఆయా అంశాలను బేరీజు వేసుకుని మూడు పేర్లను ఏఐసీసీకి ప్రతిపాదిస్తారని చెబుతున్నారు. దర

విభిన్న సామాజికవర్గాలు.. మూడు పేర్లు

ఖాస్తు చేసుకున్న ముఖ్యమైన వారిలో వెడ్మ బొజ్జు పటేల్, కంది శ్రీనివాస రెడ్డి, బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, గోక గణేశ్‌రెడ్డి, నరేష్ జాదవ్, ఆడే గజేందర్, గంద్రత్ సుజాత ఉన్నారు. వీరితో పాటు పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఆదిలాబాద్ పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, అసెంబ్లీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సామ రూపేశ్‌రెడ్డి తదితరులున్నారు.

మక్కల కొనుగోలుకు వేళాయె

- 'వానాకాలం' విక్రయాలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లాలో ఐదు కేంద్రాలు ఏర్పాటు
- రెండు రోజుల్లో ప్రారంభించే అవకాశం



ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతులు ఆరబెట్టిన మక్కలు



ఇక్కడ కనిపిస్తున్న రైతు రాకేశ్‌రెడ్డి. ఇచ్చోడ మండలంలోని ముఖరా(బి) గ్రామం. ఈ వానాకాలం సీజన్‌లో ఐదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాడు. ఎకరానికి 20 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. అయితే పంట విక్రయంపై సందిగ్ధం నెలకొంది. తాజాగా ప్రభుత్వం ఈ సీజన్‌లోనూ మద్దతు ధరతో మక్కల కొనుగోలు చేపడుతున్నట్లు ప్రకటించింది. సర్కారు నిర్ణయంపై ఇతడు హర్షం వ్యక్తం చేస్తున్నాడు.

జిల్లాలో

ఈ సీజన్‌లో మొక్కజొన్న సాగు : 50వేల ఎకరాలు
మద్దతు ధర (క్వింటాలుకు) : రూ 2,400

ఇచ్చోడ: ఈ ఏడాది వానాకాలంలో సాగైన మొక్కజొన్న కొనుగోళ్లపై సందిగ్ధం తొలగిపోయింది. ఈ సీజన్‌కు సంబంధించి మక్కల విక్రయాలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో కొన్నేళ్లుగా యాసంగిలో మాత్రమే మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా యాసంగి పంటనే మద్దతు ధరతో కొనుగోలు చేస్తూ వస్తోంది. అయితే ఈ ఏడాది పత్తి, సోయాకు ప్రత్యామ్నాయంగా వానాకాలంలోనూ జిల్లా వ్యాప్తంగా చాలా మంది రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి రావడంతో విక్రయాలపై సందిగ్ధం నెలకొంది. ఇప్పటికే కొంతమంది చేతికొచ్చిన పంట దిగుబడిని యార్డులకు తరలించారు. ఎట్టకేలకు ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో మొక్కజొన్న సాగు..
జిల్లాలో ఈ సీజన్‌లో ఇచ్చోడ, బోథ్, బజార్‌హత్నూర్, సిరికొండ, ఇంద్రవెల్లి, నార్నూర్, నేరడిగొండ, తాంసి, తలమడుగు, గాదిగూడ, సొనాల తదితర మండలాల్లో దాదాపు 50వేల ఎకరాల్లో ఈ పంట సాగు చేశారు. ఎరువుల వాడకం, పెట్టుబడి వ్యయం కూడా తక్కువగా ఉండడంతో మొగ్గు చూపారు. అయితే పంట చేతికొచ్చే సమయంలో కురిసిన అధిక వర్షాలు పెద్దగా ప్రభావం చూపకపోవడంతో రైతులు ఆశించిన దిగుబడులు చేతికందాయి.

ఐదు కేంద్రాల ద్వారా కొనుగోళ్లు
జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్న కొనుగోలుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఆదిలాబాద్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, బోథ్, నార్నూర్ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రెండు రోజుల్లో ప్రారంభిస్తాం
జిల్లా వ్యాప్తంగా ఐదు కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. రెండు రోజుల్లో ఆయా కేంద్రాల్లో విక్రయాలు ప్రారంభిస్తాం.
– ప్రవీణ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం, ఆదిలాబాద్

బీఏఎస్ విద్యార్థులను అనుమతించండి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ట్రైనీ కలెక్టర్ సలోని

- ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు కలెక్టర్ రాజర్షి షా ఆదేశం

కైలాస్‌నగర్: బెస్ట్ అవేలబుల్ స్కూల్ (బీఏఎస్) విద్యార్థులను తక్షణమే పాఠశాలల్లోకి అనుమతించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీఏఎస్‌కు సంబంధించిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఏడు పాఠశాలల్లో 1,123 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఈ పథకం కింద చదువుతున్నారని అన్నారు. సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, విద్యార్థులను, తల్లిదండ్రులను మాత్రం ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. కాగా, తమకు మూడేళ్లుగా బకాయిలు రావడం లేదని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ప్రైవేట్ యజమానులు పేర్కొన్నారు. ప్రభుత్వం త్వరలోనే 40 శాతం బకాయిలు విడుదల చేయనుందని, మిగతాది మార్చిలోగా అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకు యాజమాన్యాలు అంగీకరించి విద్యార్థులను పాఠశాలలకు అనుమతిస్తామని పేర్కొన్నారు. ఇందులో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ట్రైనీ కలెక్టర్ సలోని, డీఎస్సీడీవో సునీతాకుమారి, గిరిజన సంక్షేమాధికారి అంబాజీ, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం సందర్శన..
ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యాలయ మేనేజ్మెంట్ కమిటీ సమావేశానికి కలెక్టర్ రాజర్షి షా అతిథిగా హాజరయ్యారు. విద్యాలయ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కమిటీ సభ్యులతో చర్చించారు. ప్రిన్సిపాల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి సన్నద్ధత, సమస్యలపై ఆరా తీశారు. ఉన్నతంగా రాణించేలా శ్రద్ధ వహించాలని సూచనలు చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బార్బర్ ఇంటికి వెళ్లిన జిల్లా పాలనాధికారి..
పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన లింగంపల్లి నర్సిములు–శ్రావణిల దంపతుల కుమారుడి నామకరణ కార్యక్రమం వారి ఇంట్లో బుధవారం జరిగింది. ఆ కుటుంబీకుల ఆహ్వానం మేరకు కలెక్టర్ రాజర్షి షా వారి ఇంటికి వెళ్లి అతిథ్యాన్ని స్వీకరించారు. చిన్నారిని ఆశీర్వదించారు. కాగా నర్సిములు కలెక్టర్‌కు క్షవరం చేస్తుంటారు. కలెక్టర్ తమ ఇంటికి రావడంతో కుటుంబీకుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

వరిధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్

కైలాస్‌నగర్: వరిధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఏ–గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ. 2,389, సాధారణ రకానికి రూ. 2,369 చొప్పున కనీస మద్దతు ధర చెల్లించనున్నట్లుగా తెలిపారు. అలాగే సన్న రకానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.500 చొప్పున బోనస్ అందించనుందని పేర్కొన్నారు. సమావేశంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని, డీఏవో శ్రీధర్‌స్వామి, సివిల్ సప్లై డీఎం సుధారాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. వారికి పలు సూచనలు చేశారు. ప్రతీ కేంద్రంలో మౌలిక సౌకర్యాలు కల్పించేలా చూడాలని ఆదేశించారు.

జిల్లాకు ఏడుగురు కొత్త ఎంపీడీవోలు

కైలాస్‌నగర్: ఇటీవల ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో ఎంపీడీవోలుగా ఎంపికైన ఏడుగురిని ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించింది. ప్రస్తుతం ఎంసీహెచ్‌ఆర్‌డీలో వృత్తిపరమైన శిక్షణ పొందుతున్న సదరు అధికారులకు జిల్లాలోని వివిధ మండలాల్లో పోస్టింగ్ కల్పిస్తూ ఇన్‌చార్జి జెడ్పీ సీఈఓ రాథోడ్ రవీందర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలోనే వారు ఆయా మండలాల్లో విధుల్లో చేరనున్నారు. దీంతో జిల్లాలో ఎంపీడీవోల కొరత కొంత దూరం కానుంది. రెగ్యులర్ అధికారుల రాకతో పర్యవేక్షణ మెరుగుపడటంతో పాటు ప్రజలకు సంక్షేమ ఫలాలు సకాలంలో అందించేందుకు అవకాశం కలుగనుంది.

జిల్లాకు కేటాయించిన ఎంపీడీవోల వివరాలు

ఎంపీడీవో	పోస్టింగ్ మండలం
కోలేటి పుల్లారావు	నార్నూర్
ఎర్రోల్ల ఆంజనేయులు	బేల
సుధీర్‌కుమార్ బొక్క	జైనథ్
నాగం నరేశ్	ఇచ్చోడ
మహ్మద్ ఇంతియాజ్	గుడిహత్నూర్
కంచెపోగు వంశీకృష్ణ	ఆదిలాబాద్ రూరల్
మహమ్మద్ రయిస్ ఉల్లా	సిరికొండ

బియ్యం పంపిణీ గడువు పెంపు

కైలాస్‌నగర్: ప్రజా పంపిణీ వ్యవస్థ కింద రేషన్ దు కాణాల ద్వారా అందించే పీడీఎస్ బియ్యం పంపిణీ గడువు ఈనెల 18 వరకు ప్రభుత్వం పొడిగించినట్లు జిల్లా ఇన్‌చార్జి డీఎస్‌వో నందిని ప్రకటనలో తెలి పారు. డీలర్లు విషయాన్ని గమనించి కార్డుదారులకు బియ్యం అందించాలని ఆమె సూచించారు.

రాయితీ సద్వినియోగం చేసుకోండి

తాంసి: కూరగాయల పంటలు సాగు చేస్తున్న రైతులు ఉద్యానశాఖ ద్వారా అందించే రాయితీలు సద్వి నియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధి కారి నర్సయ్య అన్నారు. మండలంలోని పొన్నారి పంచాయతీ కార్యాలయంలో ఉద్యాన పంటలు, శాఖ ద్వారా అందించే పథకాలపై బుధవారం అవగాహన కల్పించారు. హైబ్రిడ్ కూరగాయలు సాగు చేసిన రైతులకు ఎకరానికి రూ.9,400 సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో హెచ్‌వో అలేఖ్య, హెచ్‌ఈవో శైలజ, రైతులు తదితరులున్నారు.

పకడ్బందీగా ఇమ్యునైజేషన్ అమలు

తలమడుగు: ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధి కారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. తలమడుగు పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. గర్భిణులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అలాగే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పుంజుకున్న ఎక్సైజ్ దరఖాస్తులు

- జిల్లాలో ఇప్పటివరకు 110 దాఖలు
- ఎల్లుండితో ముగియనున్న గడువు



దరఖాస్తు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: మద్యం షాపుల టెండర్లు పుంజుకున్నాయి. గత నెల 26న నోటిఫికేషన్ విడుదల కాగా ఈ నెల 14 వరకు కేవలం 50 వరకు దరఖాస్తులు అందాయి. అయితే బుధవారం ఒక్క రోజే 52 దాఖలు కావడం గమనార్హం. ఈ ఏడాది దరఖాస్తు ఫీజు రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పెంచడంతో అంతగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. 2023లో 40 వైన్స్‌షాపులకు 1,047 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు కేవలం 110 మాత్రమే వచ్చాయి. అయితే ఈ ఏడాది ఆ స్థాయిలో అందుతాయా లేదా అనే దానిపై చర్చ సాగుతుంది. బుధవారం ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 21, ఇచ్చోడ స్టేషన్ పరిధిలో 12, ఉట్నూర్ స్టేషన్ పరిధిలో 19 దరఖాస్తులు వచ్చాయి. అయితే ఇప్పటి వరకు ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో 61, ఇచ్చోడ పరిధిలో 20, ఉట్నూర్ పరిధిలో 29 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ తెలిపారు.

ఇప్పటి వరకు ఆయా దుకాణాలకు నిల్..
ఆదిలాబాద్ పట్టణంలోని 2, 4, 7, 10, 12, 14, 16, 17, 18 షాపులకు ఒక్క దరఖాస్తు కూడా అందలేదు. అలాగే ఇచ్చోడ పరిధిలో 24, 25, 26, 27, 28, 30, 31 షాపులకు, ఉట్నూర్ పరిధిలో 34, 35, 36, 40 షాపులకు ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా ఆదిలాబాద్ పట్టణంలో షాపులవారీగా కేటాయించిన స్థలంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాల్సి ఉండేది. అయితే ఈ సారి జిల్లాకేంద్రంలో షాపులు దక్కించుకున్న వారు తమకు ఇష్టమైన ప్రాంతంలో ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పించారు. అయినప్పటికీ వ్యాపారులు అంతగా ఆసక్తి చూపకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. దరఖాస్తుల ద్వారానే గతేడాది ప్రభుత్వానికి రూ.20 కోట్ల వరకు ఆదాయం సమకూరింది.

ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలి



ఆదివాసీలతో కలిసి గుస్సాడీ నృత్యం చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- ఎస్పీ అఖిల్ మహాజన్

భీంపూర్: ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండలంలోని భగవాన్‌పూర్ గ్రామంలో బుధవారం దండారీ ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీకి గ్రామస్తులు సంప్రదాయ డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుస్సాడీ వేషధారణతో ఎస్పీ నృత్యం చేస్తూ సందడి చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆదివాసీలు తమ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నారు. అలాగే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ శ్రావణ్, ఎస్సై విక్రమ్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు



అవగాహన కల్పిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: సరైన సమయంలో సీపీఆర్ చేసినట్లైతే హార్ట్‌ఎటాక్ వచ్చిన వారి ప్రాణాలను కాపాడవచ్చని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్, ప్రభుత్వ డైట్ కళాశాల, రిమ్స్ ఆసుపత్రిలో సీపీఆర్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుండెపోటు వచ్చిన పది మందిలో ఒకరు మాత్రమే ఆసుపత్రికి వెళ్తున్న క్రమంలో బతుకుతున్నారన్నారు. వారికి సరైన సమయంలో సీపీఆర్ అందించినట్లయితే సగం మందిని కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంవో శ్రీధర్, రిమ్స్ వైద్యులు నరేందర్ , డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ అనిత తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

కైలాస్‌నగర్: నాణ్యతలో రాజీపడకుండా కొత్త కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు శరవేగంగా చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా కాంట్రాక్టర్, ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని న్యూహౌసింగ్‌బోర్డు పరిధిలో రూ. 55 కోట్ల వ్యయంతో చేపట్టిన నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై సమీక్షించారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ వేగవంతం చేయాలన్నారు. హెలిప్యాడ్, పార్కింగ్ వంటి పనులను వచ్చే ఏడాది మార్చి లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ అధికారి నర్సయ్య, జిల్లా ప్రాజెక్ట్ ఇంజనీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ మేనేజర్‌కు ఉత్తమ అవార్డు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శివాజీచౌక్ ఎస్‌బీఐ రీజినల్ కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ ఉత్తమ సేవలకు గాను అవార్డు అందుకున్నారు. స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉద్యోగులకు ఏటా అందించే అవార్డును ముంబాయిలో చైర్మన్ శ్రీనివాసులు షెట్టి బుధవారం అందజేశారు. ఈ అవార్డు అందుకోవడంపై అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న బాలకృష్ణ

క్లుప్తంగా

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు

బెల్లంపల్లి: చెక్‌బౌన్స్ కేసులో ఓ నిందితుడికి బుధవారం ఏడాది జైలుశిక్ష పడింది. బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో కె.శ్రీనివాస రావు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి ఫుట్‌బాల్ గ్రౌండ్ బస్తీకి చెందిన రత్నం రాజం అనే వ్యక్తి వద్ద 2019లో అదే బస్తీకి చెందిన బోగే మోహన్ రూ.3.5 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఈమేరకు మోహన్ తనకు చెందిన చెక్‌ను రాజంకు ఇచ్చాడు. చెక్‌ను రాజం బ్యాంక్‌లో డిపాజిట్ చేయగా ఖాతాలో నగదు లేక చెక్ బౌన్స్ అయ్యింది. బాధితుడు రాజం కోర్టులో కేసు వేయగా విచారించిన బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జె.ముఖేశ్ నేరం రుజువు కావడంతో బుధవారం బోగే మోహన్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

బైక్‌లో నుంచి నగదు చోరీ


కార్యాలయం ఎదుట బీమన్‌కార్ ఇస్త్రారి

కాగజ్‌నగర్‌టౌన్: బైక్‌లో ఉంచిన నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కాగజ్‌నగర్ మండలంలోని ఆరెగూడ గ్రామానికి చెందిన బీమన్‌కార్ ఇస్త్రారి తన కుమారుడు బీమన్‌కార్ బబ్లుతో కలిసి పట్టణంలోని తెలంగాణ గ్రామీణబ్యాంక్‌లో రూ.2.25 లక్షలు డ్రా చేసుకున్నారు. డ్రా చేసుకున్న డబ్బులను బైక్‌లో పెట్టుకొని కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయానికి సర్టిఫికెట్ కోసం వెళ్లారు. బబ్లు బైక్‌ను కార్యాలయ ఆవరణలో నిలిపి కార్యాలయంలోనికి వెళ్లాడు. ఇస్త్రారి బైక్‌కు కొంచెం దూరంగా ఉండడాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌లో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు. చుట్టుపక్కల వారిని అడిగినా తెలియదని చెప్పడంతో చేసేదేం లేక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తగ్గిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజులు

సాక్షి ఎఫెక్ట్..

లక్ష్మణచాంద: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ విద్యార్థులకు పెంచిన పరీక్ష ఫీజులను అధికారులు తగ్గించారు. ఇటీవల మొదటి సెమిస్టర్ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.3250గా నిర్ణయించారు. దీంతో మధ్యతరగతి విద్యార్థులు పెంచిన ఫీజులు కట్టలేమని వాపోయారు. వారి ఇబ్బందులపై 'సాక్షి'లో ఈ నెల 10న 'మోయలేని భారం' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పరీక్ష ఫీజులు తగ్గించి గత సంవత్సరం ఫీజులు చెల్లించాలని విద్యార్థులకు సూచించారు. బీఏ ఫస్ట్ సెమిస్టర్ విద్యార్థులు రూ.1440, బీఎస్సీ, బీకాం విద్యార్థులు రూ.1640 చెల్లించాలని నిర్ణయించారు.

టెంబుర్నిలో అరుదైన విగ్రహాలు


ఉగ్ర నారసింహుడు


విష్ణుమూర్తి

నర్సాపూర్(జి): నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి 21 కిలోమీటర్ల దూరంలో ప్రాచీన చారిత్రక గ్రామం టెంబుర్నిలో 12వ శతాబ్దపు ఉగ్ర నారసింహుడు, విష్ణుమూర్తి, సరస్వతిదేవి, నృత్య గణపతి, ద్వార పాలకుడు విగ్రహాలు లభ్యమైనట్లు ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ తుమ్మల దేవరావ్ తెలి పారు. రెండు దశబ్దాల క్రితం పనికి ఆహార పథకంలో భాగంగా తవ్వకాలు చేస్తున్నప్పుడు అరుదైన వి గ్రహాలు బయటపడ్డాయని తెలిపారు. కాకతీయుల కాలంలో నిర్మించిన శివాలయం శివకేశవులకు భే దం లేదన్న సందేశం ఇస్తుందని పేర్కొన్నారు. ఇ క్కడ ప్రధాన ఆలయం శ్రీచక్ర లింగం కలిగిన శివా లయమే అయినా స్తంభాలకు అరుదైన శిల్ప ప్రతి మలు చెక్కినారని వివరించారు. చామరధారిణి వి గ్రహాలు, ద్వారపాలకుల సుందర విగ్రహాలతో పాటు విలక్షణమైన సరస్వతిదేవి ప్రతిమ, ఉగ్రనారసింహుడు, నృత్య గణపతి, విష్ణుమూర్తి ప్రతిమలు స్తంభాలకు మలిచారని తెలిపారు. ఆలయ పీఠ స్తంభాలు చెల్లాచెదురుగా పడి ఉండడం వల్ల ఆలయం విధ్వంసానికి గురైనట్లు తెలిపారు. ఈ ప్రాంత పరిసరాలను పరిశీలిస్తే శాతవాహన, కళ్యాణి చాళుక్య, కాకతీయుల కాలంలో గొప్ప నాగరికత విలసిల్లినట్లు తెలుస్తుందన్నారు. పురావస్తు శాఖ ప్రత్యేక దృష్టి సారించి వీటిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అబ్బిడి రాజేశ్వర్ రెడ్డి, మానస సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఇంద్రాదేవి ఆలయంలో గుస్సాడీల పూజలు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో బుధవారం సిరికొండ మండలం నేరడిగొండ గ్రామానికి చెందిన గుస్సాడీలు, దండారీ బృందం ఆదివాసీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి ఇంద్రాదేవికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గుస్సాడీలు చేసిన నృత్యం, యువకులు చేసిన కోలాటం ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం జన్నారం మండలంలోని గుడిరేవు పద్మల్‌పూరి కాకో ఆలయానికి బయల్దేరి వెళ్లారు. ఇందులో గ్రామపెద్దలు ఉన్నారు.

తుపాకీ దించి.. అజ్ఞాతం వీడి..

- జనజీవన స్రవంతిలోకి మావోయిస్టు దంపతులు
- ఉమ్మడి జిల్లాకు చెందిన సరోజ, మోహన్‌రెడ్డి లొంగుబాటు
- నాలుగు దశాబ్దాలకు పైగా ఉద్యమ ప్రస్థానం
- 'మల్లోజుల' వెంట అజ్ఞాతవాసానికి తెర


సలాకుల సరోజ(ఫైల్)

బెల్లంపల్లి/నిర్మల్: నమ్మిన సిద్ధాంతాల కోసం అడవి బాట పట్టి అజ్ఞాతంలోకి వెళ్లారు. సుమారు నాలుగున్నర దశాబ్దాలకు పైగా ఉద్యమం ప్రస్థానం కొనసాగించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ వల్ల ఉద్యమం పలుచనబడి అనేకమంది అమరులు అవుతున్నారని, ఈ క్రమంలో సాయుధ పోరాటం అసాధ్యమని ప్రకటించిన మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ రావు అభిప్రాయంతో ఏకీభవించి తుపాకీ దించి వనం వీడారు. బుధవారం మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట 'మల్లోజుల' నేతృత్వంలో లొంగిపోయిన 60మందిలో ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన దంపతులు సలాకుల సరోజ, ఇర్రి మోహన్‌రెడ్డి ఉన్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన సరోజ ఉరఫ్ లత ఉరఫ్ దీప ఉరఫ్ స్వాతి మావోయిస్టు పార్టీ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ(డీకేఎస్‌జెడ్‌సీ) సెక్రెటరీగా, ఆమె భర్త నిర్మల్ జిల్లా సోన్ మండలం కూచన్‌పల్లి గ్రామానికి చెందిన ఇర్రి మోహన్‌రెడ్డి ఉరఫ్ వివేక్ మావోయిస్టు పార్టీ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ ఇంచార్జిగా వ్యవహరిస్తున్నారు. వీరిద్దరిపై చేరో రూ.50లక్షల వరకు రివార్డు ఉన్నట్లు తెలుస్తోంది.

పెళ్లి ఇష్టంలేక ఉద్యమానికి ఆకర్శితురాలై..

బెల్లంపల్లి కన్నాలబస్తీకి చెందిన సలాకుల రాజమ్మ, సాయిలు దంపతులకు కుమారులు రాజనర్సు, మల్లయ్య, రామస్వామి, కూతుళ్లు లక్ష్మీ, ఎల్లక్క, సరోజ సంతానం. సింగరేణి కార్మికుడైన సాయిలు సరోజకు 15ఏళ్ల వయస్సులో బాల్యవివాహం చేశాడు. అప్పటికి ఆమె స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతుండేది. ప్రస్తుత పెద్దపల్లి జిల్లా పొత్కపల్లి మండలానికి చెందిన దగ్గరి బంధువుకు ఇచ్చి పెళ్లి చేయగా భర్త వేధింపులతో పుట్టింటిలో ఉండి అతడికి దూరమైంది.

ఉద్యమ ప్రభావంతో..

పీపుల్స్‌వార్ పార్టీ ఉద్య మం కన్నాలబస్తీలో తీవ్ర స్థాయిలో ఉండేది. 1984 లో పీపుల్స్‌వార్ పార్టీ వారం రోజులపాటు నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతులకు హాజరై విప్లవ ఓనమాలు నేర్చుకుంది. ఇష్టంలేని పెళ్లి, భర్త వేధింపులు తదితర అంశాలతో తీవ్రంగా కలతచెంది పోరుమార్గాన్ని ఎంచుకుని రహస్య జీవితంలోకి వెళ్లిపోయింది.

దండకారణ్యంలోనే..

సరోజ ఉద్యమ ప్రస్థానమంతా దండకారణ్యం కేంద్రంగా సాగింది. కేవలం ఏడాదిపాటు కొత్తగూడెం నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు కొరియర్‌గా పని చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన హింసాత్మక కార్యకలాపాలకు దూరంగా ఉండడంతో పోలీసు రికార్డుల్లో ఆమె పేరు వినిపించలేదు. పార్టీ ఆదేశాల మేరకు దండకారణ్యంలోకి వెళ్లి నాలుగు దశాబ్దాలపాటు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిశా ఆదివాసీలతో కలిసి గడిపింది. కొన్నాళ్లపాటు పార్టీ ప్రింటింగ్ ప్రెస్ బాధ్యతలు, ఇతరత్రా కార్యకలాపాలు నిర్వహించింది.

దీప పేరుతో వ్యాసం..

అమరుడు మావోయిస్టు పార్టీ అగ్ర నాయకుడు కటకం సుదర్శన్ ఉరఫ్ దూలాదాదా, సరోజ ఇద్దరు కూడా కన్నాలబస్తీ వాస్తవ్యులు. దండకారణ్యంలో ఉద్యమ కార్యకలాపాల్లో భాగంగా పలుమార్లు సుదర్శన్‌తో మాట్లాడే అవకాశం ఆమెకు దక్కింది. సుదర్శన్ అనారోగ్యం మరణించిన సమయంలో ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ 'అరుణ తార' పత్రికలో దీప పేరుతో సరోజ ప్రత్యేకంగా వ్యాసం రాసి విప్లవ స్మృతులను నెమరు వేసుకుంది.

రూర్కేలాలో అరెస్టు

ఉద్యమ విస్తరణలో భాగంగా జార్ఖండ్ రాష్ట్రంలో కార్యకలాపాలు సాగిస్తూ సరోజ, మోహన్‌రెడ్డి సహచరులతో ఓసారి రూర్కేలా పోలీసులకు పట్టుబడ్డారు. వరంగల్ సెంట్రల్ జైలుకు తరలించగా.. నేరం రుజువు కాకపోవడంతో కేసును కోర్టు కొట్టివేసింది. దీంతో 2009లో జైలు నుంచి విడుదలైన ఇద్దరూ నక్సలైట్ అగ్రనాయకులు మూల దేవేందర్ రెడ్డి, మాధవ్, అమరుడు జాడి వెంకటితో కలిసి అజ్ఞాతంలోకి వెళ్లారు.

ఆనందంగా ఉంది..



మా చెల్లెలు పిన్నవయస్సులో ఉద్యమంలోకి వెళ్లింది. నలభై ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో ఆమె ఒక్కసారికూడా ఇంటి ముఖం చూడలేదు. ఎన్నోమార్లు ప్రభుత్వానికి లొంగిపోయి మాతో కలిసి జీవితాన్ని గడపాలని పత్రిక ముఖంగా కోరాం. ఇన్నాళ్లకు ఉద్యమ బాట వీడి జనజీవన స్రవంతిలో కలవడం చాలా ఆనందంగా ఉంది.

– సలాకుల రామస్వామి, తోబుట్టువు

ఐటీఐ చేస్తూ.. అటే వెళ్లాడు..


ఇర్రి మోహన్‌రెడ్డి (ఫైల్)

నిర్మల్ జిల్లా సోన్ మండలం కూచన్‌పల్లికి చెందిన ఇర్రి నర్సమ్మ, శివారెడ్డి దంపతులకు నలుగురు కుమారులు. మూడో సంతానంగా మోహన్‌రెడ్డి 1960లో జన్మించాడు. సోన్‌లోని జెడ్పీ హెచ్‌ఎస్‌లో 1976లో పదో తరగతి చదివాడు. పెద్దన్నయ్య సింగరేణిలో ఉద్యోగరీత్యా గోదావరిఖనిలో పనిచేస్తుండేవాడు. ఆయన వెంట వెళ్లిన మోహన్‌రెడ్డి మంచిర్యాలలో ఐటీఐలో చేరాడు. అక్కడ చదువుతూ పీపుల్స్‌వార్ భావజాలానికి ప్రభావితుడయ్యాడు. అలా.. అక్కడి నుంచే మోహన్‌రెడ్డి దళంలోకి వెళ్లి మళ్లీ ఇంటిముఖం చూడలేదు. వరంగల్ జైలులో ఉన్నప్పుడు చాలా ఏళ్లకు కుటుంబసభ్యులు ఆయనను చూడగలిగారు. జైలు నుంచి విడుదల తర్వాత మళ్లీ దళం వైపే వెళ్లాడు. 2010లో తండ్రి శివారెడ్డి, 2021లో తల్లి నర్సమ్మ మరణించినా ఆఖరి చూపులకూ రాలేదు.

ఆచూకీ లేని తూము శ్రీనివాస్..

నిర్మల్ జిల్లా నుంచి కేంద్రకమిటీ స్థాయికి ఎదిగిన మావోయిస్టు నేతలు ఉన్నారు. సారంగపూర్ మండల కేంద్రానికి చెందిన ఒగ్గు సత్వాజీ అలియాస్ సుధాకర్/బురియార్/కిరణ్ మావోయిస్టు పార్టీ కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, సెంట్రల్ మిలటరీ సభ్యుడిగా, బిహార్–జార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ ఇన్‌చార్జిగా కొనసాగారు. ఆయన 2019 ఫిబ్రవరిలో తన భార్యతో కలిసి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. ఆ స్థాయిలో దాదాపు నాలుగు దశాబ్దాలపాటు దళంలో కొనసాగిన మోహన్‌రెడ్డి తాజాగా లొంగిపోయారు. కడెం మండలం లక్ష్మీసాగర్‌కు చెందిన కంతి లింగవ్వ అలియాస్ అనిత 2022 డిసెంబర్‌లో ఎన్‌కౌంటర్‌లో మృతిచెందింది. మిగతావాళ్లు లొంగిపోగా, ఖానాపూర్ మండలం బాబాపూర్(ఆర్)కు చెందిన తూము శ్రీనివాస్ అలియాస్ శ్రీను ఆచూకీ ఇప్పటికీ తెలియడం లేదు. అటు పోలీసులు, ఇటు కుటుంబసభ్యులు ఎవరికీ తూము శ్రీనివాస్ జాడ తెలియకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో తాజాగా మోహన్‌రెడ్డి లొంగుబాటుతో జిల్లాలో ఒకప్పుడు వెలుగు వెలిగిన 'దళం' ఖాళీ అయ్యింది.

జనజీవన స్రవంతిలోకి రావాలి..



జిల్లాలో దాదాపు మావోయిస్టు నేతలంతా జనజీవన స్రవంతిలోకి వచ్చారు. తాజాగా మోహన్‌రెడ్డి కూడా లొంగిపోవడం శుభపరిణామం. ఇంకా ఎవరైనా మావోయిస్టులు ఉంటే వారు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని కోరుతున్నాం.

–జానకీషర్మిల, ఎస్పీ, నిర్మల్

ఉపాధివేటలో యువకుడు మృతి

- జోర్డాన్‌లో అసువులుబాసిన వలస కార్మికుడు


బోయిడి రాజు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఉపాధి కోసం పొట్ట చేత పట్టుకుని గల్ఫ్ దేశాలకు తరలివెళ్లిన జిల్లా వలస కార్మికుడు అక్కడే అసువులు బాశాడు. నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన బోయిడి రాజు (27) అనే యువకుడు ఉపాధి నిమిత్తం గతేడాది జోర్డాన్ దేశానికి వెళ్లాడు. అక్కడ క్లాసిక్ ఫ్యాషన్స్ కంపెనీలో క్లీనర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. గత మంగళవారం పనులు చేస్తున్న సమయంలో మూడో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు అక్కడి వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా మృతుడి తండ్రి ఎర్రన్న బుధవారం జిల్లా కేంద్రంలోని రాష్ట్ర ఎన్నారై సలహా కమిటీ సభ్యుడు స్వదేశ్ పరికిపండ్లకు విషయం తెలిపారు. సాధారణ పరిపాలన శాఖ ద్వారా జోర్డాన్ దేశంలోని భారత రాయబార కార్యాలయానికి వివరాలను అందజేసి అక్కడి కంపెనీ అధికారులతో మాట్లాడి మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు స్వదేశ్ పరికిపండ్ల పేర్కొన్నారు.

వైద్యం వికటించి యువకుడి మృతి!

బెల్లంపల్లి: జ్వరంతో బాధపడుతున్న తాండూర్ మండలానికి చెందిన ఓ యువకుడు ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి మృతి చెందినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మండలంలోని ద్వారకాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువకుడికి గత నెలలో జ్వరం రాగా చికిత్స కోసం ఓ ఆర్‌ఎంపీని ఆశ్రయించాడు. సదరు ఆర్‌ఎంపీ రెండు ఇంజక్షన్‌లు ఇచ్చి, సెలైన్ పెట్టాడు. దీంతో సదరు యువకుడు అపస్మారక స్థితిలోకి వెళ్లగా చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. గతనెల 27న ఈ ఘటన జరగ్గా బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డట్లు తెలుస్తోంది. తాజాగా వైద్యం వికటించి యువకుడు మృతి చెందినట్లు గుసగుసలు విన్పిస్తున్నాయి. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదని సమాచారం.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో ఓ వ్యక్తి కరెంట్ షాక్‌తో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఈద్గాంకు చెందిన జానా రమేశ్ (40) తన అన్న పాత ఇంటి పక్కన మరో కొత్త ఇల్లు నిర్మాణం చేపట్టాడు. దీంతో కొత్త ఇల్లుకు పాత ఇంటి నుంచి కరెంట్ కనెక్షన్ ఇచ్చారు. ఈక్రమంలో రమేశ్ తెలియక కరెంట్ వైర్‌ను ముట్టుకోవడంతో షాక్ కొట్టి కిందపడిపోయాడు. వెంటనే అక్కడ పనిచేసే వారు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. రమేశ్‌కు భార్య, కొడుకు ఉన్నారు. వీరు గత పది సంవత్సరాల నుంచి రమేశ్‌కు దూరంగా ఉంటున్నారు. రమేశ్ అన్న మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి


బక్కన్న (ఫైల్)

నెన్నెల: అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన కౌలు రౌతు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాం గ్రామానికి చెందిన కౌలు రైతు కడారి బక్కన్న(40) మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. పెట్టుబడి కోసం రూ.2 లక్షలు వరకు అప్పు చేశాడు. అధిక వర్షాలతో పంట నష్టపోగా అప్పులు ఎలా తీర్చాలో తెలియలేదు. దీంతో ఈ నెల 3న ఇంటి వద్ద గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి అక్కడి నుంచి వరంగల్‌కు తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అతని భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

దహెగాం: మండల కేంద్రానికి చెందిన దాసరి ఆద్యశ్రీ (స్రవంతి(22)) అనే మహిళ పాము కాటుకు గురై మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం భర్త శ్రావణ్‌తో కలిసి స్రవంతి వ్యవసాయ పనులకు వెళ్లింది. వ్యవసాయ పనులు చేసుకుంటున్న సమయంలో దాహం వేయడంతో పొలంలో ఉన్న మోటర్ వద్దకు వెళ్లగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందింది.

ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి


సాయమ్మ (ఫైల్)

సారంగపూర్: మండల కేంద్రానికి చెందిన దేవి సాయమ్మ (80) అనే వృద్ధురాలు బుధవారం ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొని మృతిచెందింది. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాల బస్సు సాయంత్రం పిల్లలను దింపేందుకు ఎస్సీ కాలనీకి వెళ్లింది. బస్సు డ్రైవర్ జాదవ్ అంకుష్ విద్యార్థులను దింపేసి తిరిగి బస్సును రివర్స్ చేసే క్రమంలో ఇంటి ముందు నిలబడి ఉన్న వృద్ధురాలిని ఢీకొట్టాడు. ప్రమాదంలో దేవి సాయమ్మకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకుంది. స్థానికులు సాయమ్మను నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమేరకు బస్సుడ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

హోరాహోరీగా జోనల్‌స్థాయి ఎంపిక పోటీలు


రాష్ట్ర స్థాయికి ఎంపికైన జట్టు

ఆసిఫాబాద్‌రూరల్: జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం జిల్లా కేంద్రంలో హోరాహోరీగా సాగాయి. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో జోనల్‌స్థాయి పోటీలు నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ జోనల్‌స్థాయి బాలికల వాలీబాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 48 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 12 మందిని ఎంపిక చేశామని తెలిపారు. వీరిలో ఆసిఫాబాద్ నుంచి ఐదుగురు, మంచిర్యాల నుంచి ఐదుగురు, నిర్మల్ నుంచి ఇద్దరు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వీరు మహబూబ్‌నగర్‌లో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పీడీ మీనారెడ్డి, ఖేల్ ఇండియా కోచ్ రాకేశ్, పీఈటీలు లక్ష్మి, నాగమణి, భవిత, లక్ష్మణ్, శ్రీనివాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న ఒకరిపై కేసు

లింగాపూర్: సిర్పూర్(యూ) మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సిర్పూర్(యూ) మండలంలోని పంగిడి గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దదోబ గ్రామ శివారులోని పత్తి చేనులో 35 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొక్కలు సాగు చేస్తున్న వల్క శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

వినోద్‌కుమార్‌కు యోగా రిఫరీ అవార్డు


అవార్డు అందుకుంటున్న వినోద్‌కుమార్

జన్నారం: మండలంలోని మహ్మదాబాద్ గ్రామానికి చెందిన దుర్గం వినోద్‌కుమార్‌కు జాతీయస్థాయి యోగా రిఫరీ అవార్డు లభించింది. శ్రీ గణపతి సచ్చితానంద ఆశ్రమం, మైసూర్ వేదికగా అక్టోబర్ 9 నుంచి 12 వరకు, కర్ణాటక స్టేట్ అమెచ్యూర్ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 50వ గోల్డెన్ జూబ్లీ సీనియర్ నేషనల్ యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ నిర్వహించారు. తెలంగాణ నుంచి నేషనల్ యోగా రిఫరీగా విశేష సేవలు అందిస్తున్నందుకు వినోద్‌కుమార్ యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీ అభినవ్ జోషి, వైస్ ప్రెసిడెంట్ మనోహర్, అగర్వాల్‌ల చేతుల మీదుగా బుధవారం మైసూర్‌లో అవార్డు అందుకున్నారు. ఆయనను ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు.

'ప్రజల సంరక్షణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్'


వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్: ప్రజల రక్షణ కోసమే పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డెన్ సెర్చ్) నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రణదీవేనగర్‌లో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన ధ్రువపత్రాలు లేని 60 ద్విచక్ర వాహనాలు, 31 ఆటోలు, రెండు ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గంజాయి తనిఖీ చేశామని, అనుమతులు లేకుండా విక్రయిస్తున్న 16 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐలు బి. సునీల్ కుమార్, కె. నాగరాజు, కె. ఫణిదర్, కర్రె స్వామి, ఎస్సైలు విష్ణువర్ధన్, డి. రాధిక, మహేందర్, రాకేశ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో విచారణ పూర్తి

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలలో గతంలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు ఉపాధ్యాయులపై బుధవారం అధికారులు విచారణ జరిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఉపాధ్యాయులు మనోహర్ రెడ్డి, మోహన్‌రావులను గత ఫిబ్రవరి 2న విధుల నుంచి తొలగించిన విషయం విధితమే. విచారణకు ఇటీవల డీఈవో ముగ్గురు విచారణ అధికారులను నియమించారు. నివేదికను త్వరలోనే ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు సమాచారం.

'విధులకు హాజరు కావాలి'

ఉట్నూర్‌రూరల్: విద్యార్థుల సంక్షేమం, భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని కార్మికులు విధులకు హాజరు కావాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో పార్ట్ టైం, దినసరి వేతనంతో పని చేస్తున్న 220 మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్న నేపథ్యంలో వారి మూడు నెలల వేతనాన్ని ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో తాత్కాలికంగా బయట వ్యక్తులు పని చేస్తున్నారన్నారు. కొంత మంది కార్మికులు జీతాలు చెల్లించిన తర్వాత కూడా ముందస్తు అనుమతి లేకుండా, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా సమ్మెలో కొనసాగుతున్నారని పేర్కొన్నారు.

కన్నకొడుకే కడతేర్చాడు..!

- తానూరులో మిస్టరీ వీడిన అదృశ్యం కేసు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకీషర్మిల


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

భైంసాటౌన్: తానూరు మండలంలోని ఎల్వి గ్రామానికి చెందిన పన్నేవాడ్ లక్ష్మణ్ (56) హత్య కేసు మిస్టరీ వీడింది. కన్న కొడుకే క్షణికావేశంలో తండ్రిని హత్య చేసి పంటచేనులో పాతి పెట్టినట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ జీ. జానకీ షర్మిల బుధవారం కేసు వివరాలు వెల్లడించారు. ఆగస్టు 31న లక్ష్మణ్ అదృశ్యం కాగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. రెండురోజుల కిందట గ్రామ సమీపంలోని చెక్‌డ్యాం వద్ద గోనెసంచిలో లక్ష్మణ్ మృతదేహాన్ని గుర్తించారు. ఈ మేరకు విచారణ చేపట్టగా అతని కొడుకు(17) హత్య చేసినట్లు నిర్ధారించారు. ఆగస్టు 31న రాత్రి తండ్రితో కలిసి కుమారుడు చేను వద్దకు వెళ్లగా, చేను చుట్టూ చూసి రమ్మని తండ్రి చెప్పాడు. దీంతో తాను వెళ్లనని మొండికేయడంతో తండ్రి మందలించాడు. క్షణికావేశానికి గురైన కొడుకు అక్కడే ఉన్న గొడ్డలితో కొట్టి చంపి అక్కడే చేనులో తండ్రి మృతదేహాన్ని పాతిపెట్టాడు.

పెంపుడు కుక్కే పట్టించింది..

వారం రోజులకు తల్లితో కలిసి తన తండ్రి కనిపించడం లేదని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండురోజుల కిందట మృతుడి పెంపుడు కుక్క చేనులో తిరుగుతూ మృతదేహం పాతిపెట్టిన స్థలంలో గోనెసంచిని వెలికితీసింది. దీంతో మృతుడి పుర్రెభాగం బయటికి రాగా గమనించిన గొర్రెల కాపరులు పోలీసులకు సమాచారమిచ్చినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ మేరకు ఘటనాస్థలంలో లభించిన ఆధారాలతో కొడుకే హత్య చేసినట్లుగా నిర్ధారణకు వచ్చారు. హత్యకు ఉపయోగించిన గొడ్డలి, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి జువైనల్ హోంకు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. ఏఎస్పీ అవినాశ్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన ముధోల్ సీఐ మల్లేశ్, ఎస్సై పెర్సిస్, తానూర్ ఎస్సై జుబేర్‌లను ఎస్పీ అభినందించారు.

దొంగతనానికి వచ్చి దొరికిపోయారు..!


ఎస్‌అండ్‌పీసీ కంట్రోల్ రూంలో ఇద్దరు నిందితులు


సిబ్బందిని ప్రశంసిస్తున్న జీఎం రాధాకృష్ణ


మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీలో దొంగతనానికి వచ్చిన ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరిని సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. ఏరియా జీఎం రాధాకృష్ణ తెలిపిన వివరాలు.. మంగళవారం రాత్రి సుమారు 9.30 గంటలకు ఏరియాలోని కేకే –ఓసీ ఆవరణలోని స్టోర్ వద్దకు ముగ్గురు వ్యక్తులు వచ్చి దొంగతనానికి యత్నించారు. అక్కడ విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డు సదానందం వారిని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. వెంటనే అప్రమత్తమైన అధికారులు ఎంటీఎఫ్ టీంను అలర్ట్ చేశారు. వారు అక్కడికి చేరుకుని స్టోర్ పరిసర ప్రాంతాల్లో పరిశీలించగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడగా, ఒకరు పారిపోయారు. పట్టుబడిన వారిని ఏరియాలోని ఎస్‌అండ్‌పీసీ ఆఫీస్‌లోని కంట్రోల్‌రూంకు తరలించి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని జీఎం తెలిపారు. ఓసీ ఆవరణలోకి చొరబడిన వ్యక్తులను పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బందిని ఏరియా జీఎం రాధాకృష్ణ, ఎస్వో టూ జీఎం విజయప్రసాద్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ రవి తదితరులు ప్రశంసాపత్రం అందించి అభినందించారు.

'సమస్యల పరిష్కారంలో గెలిచిన సంఘాలు విఫలం'


మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన కార్మిక సంఘాలు కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన ఎస్ఆర్పీ1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి కంపెనీకి రావాల్సిన రూ.42 వేల కోట్ల బకాయిలు ఇప్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. తక్కువ లాభాలు చూపి వాటా పంపిణీ చేసి కార్మికులకు అన్యాయం చేశారన్నారు. సింగరేణిలో మెడికల్ బోర్డు ఎత్తివేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని, దీనిపై అన్ని కార్మిక సంఘాలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఆ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, రాష్ట్ర కమిటీ సభ్యుడు కస్తూరి చంద్రశేఖర్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్, నాయకులు వెంకటరెడ్డి, గోపాల్ సింగ్, రాథోడ్ పాల్గొన్నారు.

సంపత్‌కు సాహితీ పురస్కారం


టి.సంపత్‌కుమార్

నిర్మల్‌ఖిల్లా: ప్రతిష్టాత్మక సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం 2023, జిల్లాకు చెందిన సాహితీవేత్త డాక్టర్ టి.సంపత్ కుమార్‌ను వరించింది. పలు సాహితీ విభాగాల్లో రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రంథాలను ఎంపిక చేయగా ఉత్తమ కథా సంపుటిగా ఈయన రాసిన 'నా నుంచి మన వరకు' ఉంది. ఇదే రచనకు 2023, మేలో తెలంగాణ సరస్వత పరిషత్ రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందించింది. ఈ నెల 29న హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీ ఎన్టీఆర్ కళామందిరంలో రూ.20,116 నగదు పురస్కారంతో సంపత్‌కుమార్‌ను సత్కరించనున్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ ప్రాంతానికి చెందిన డాక్టర్ టి.సంపత్ కుమార్ కెనడా హైకమిషన్ కార్యాలయంలో దాదాపు నాలుగు దశాబ్దాలపాటు వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. ఢిల్లీలో పదవీ విరమణ పొందిన అనంతరం ప్రస్తుతం నిర్మల్ జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్నారు. తెలుగుతోపాటు ఆంగ్ల భాషల్లోనూ అనేక కథలు, నవలలు రచించారు.